



గ్రౌండ్‌ను తనిఖీ చేస్తున్న నిఘా బృందం

నేడే జెండా పండగ

- ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు పూర్తి
- సిద్ధమైన ప్రభుత్వ శాఖల శకటాలు
- పతాకావిష్కరణ చేయనున్న మంత్రి అచ్చెన్నాయుడు
- 250 మందికి ప్రశంసాపత్రాలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

జెండా పండగకు సర్వం సిద్ధమైంది. గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతీయ జెండాను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఎగురవేయనున్నారు. అనంతరం జిల్లా ప్రగతిపై ప్రసంగించనున్నారు. ప్రభుత్వ పనితీరును తెలిపేలా శకటాలను ప్రదర్శించనున్నారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లాలో ఉత్తమ సేవలందించిన 250 మంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సన్మానించనున్నారు. జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులను సత్కరించనున్నారు. అలాగే పలు విభాగాలకు చెందిన స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రార్థనా స్థలాలు, దేవాలయాలు త్రివర్ణ విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్నాయి. అలాగే శ్రీకాకుళం, పలాసలో మూడు అన్న క్యాంటీన్‌లను ప్రభుత్వం ప్రారంభించనుంది.



ప్రధాన వేదిక



కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య వేడుకల ముఖద్వారం



విద్యుత్ కాంతుల్లో శ్రీకాకుళం నగర పాలక సంస్థ కార్యాలయం

ఆ రోజు.. పండగ చేసుకున్నాం

- ఊరూరా కలియతిరిగాం
- ఉద్యమ కారులకు జేజేలు పలికాం

'బ్రిటీష్ పాలనలో భారతీయులు పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు. మనల్ని బానిసలుగా చూసేవారు ఆంగ్లేయులు. స్వాతంత్ర్యం కోసం గాంధీ, నెహ్రూ, సర్దార్ వల్లభాయ్‌పటేల్, టంగుటూరి ప్రకాశం పంతులు వంటి ఎందరో దేశ నాయకులు పోరాటం చేశారు. చివరకు 1947న స్వాతంత్ర్యం సిద్ధించింది. చరిత్రలో నిలిచి పోయే ఆ రోజును భారతీయులు ఎన్నటికీ మరచిపోలేరు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు వృద్ధులు ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన సంగతి ఎలా తెలిసింది. అసలు అప్పుడేం జరిగింది, ప్రజలు ఎలా సంబరాలు చేసుకున్నారు, తదితర విషయాలను వెల్లడించారు.'

బ్రిటీష్ వారిని ఎదిరించాం..



టెక్కలి: 'స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారిని ఎదురించాం. సర్దార్ గౌతు లచ్చన్న తో కలిసి అనేక పోరాటాల్లో పాల్గొన్నాం. బ్రిటీష్ వారి క్యాంపులకు వెళ్లే టెలీఫోన్ వైర్లను కట్ చేసి పలుమార్లు పట్టుబడ్డాం. మాపై కేసులు నమోదుచేసి జైళ్లలో పెట్టారు. అప్పట్లో పోరాటాలు చేయాల్సి వస్తే అందరం ఒక మాటగా చేసేవాళ్లం. గాంధీజీ చెప్పిన మాటలను వేదవాక్కుగా పాటించేవాళ్లం. బ్రిటీష్ వారి వేధింపులకు తాళలేక కుటుంబాలకు దూరంగా గడ పాల్సి వచ్చేది. నాడు పెద్దలంటే గౌరవం ఉండేది. నేడు ఆ పరిస్థితి లేదు. నాడు విలువలతో కూడిన సమాజం ఉండేది. పెద్దలు ఒక నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయానికి కట్టుబడి ఉండేవాళ్లం.

-కోట చిన్నబాబు (101), స్వాతంత్ర్య సమరయోధుడు, టెక్కలి

ర్యాలీలు చేశాం..



వజ్రపుకొత్తూరు: 'స్వాతంత్ర్యం వచ్చిన రోజు మేమంతా ఉపాధ్యాయులతో కలసి వివిధ గ్రామాల్లో ర్యాలీలు చేశాం. మా ర్యాలీని ఆహ్వానిస్తూ ఆ గ్రామాల పెద్దలు మిఠాయిలు పంపిణీ చేశారు. మా గ్రామం పక్కనే ఉన్న గుల్లలపాడులో చౌదరి కుటుంబీకులు భోజనాలు పెట్టారు. ఇప్పటికీ ఆ రోజులు గుర్తుకు వస్తున్నాయి.'

-పుక్కళ్ల అప్పన్న(95), డోకులపాడు

ఆ రోజు ఊరంతా పండగే..



హరిపురం: 'స్వాతంత్ర్యం వచ్చిన నాటికి నాకు 12ఏళ్లు. రెండో తరగతి వరకు చదివి మానేశాను. రాజుగారి వద్ద అంచనాకారులుగా పనిచేసే ఇద్దరు వ్యక్తులు మా గ్రామం వచ్చి మనకు స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పారు. దీంతో సుమారు నలభై మంది గ్రామం మొత్తం కలియ తిరిగాం. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. అనంతరం హరిపురంలో సమావేశం పెట్టటంతో మేమంతా అక్కడికి చేరుకున్నాం. నెహ్రూ చేసిన తొలి ప్రసంగం సభలోనే రేడియో ద్వారా విన్నాం. సాయంత్రం ఈలలు, కంచాలతో డప్పులు కొడుతూ, ఉద్యమకారులకు జేజేలు పలుకుతూ ఊరంతా తిరిగాం. ఆ దృశ్యాలు నేటికీ నా కళ్ల ముందు కదులుతున్నాయి.'

-బొంగి వెంకయ్య (89), బాలిగాం

దేశభక్తి భావం పెంపొందించాలి: ఎస్పీ



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం: యువతలో దేశ భక్తి భావం పెంపొందించేలా పోలీసు కవాతు నిర్వహించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో గురువారం జరగనున్న స్వాతంత్ర్య వేడుకలకు సంబంధించి పోలీసు మాక్‌డ్రిల్‌ను ఎస్పీ బుధవారం పరిశీలించారు. పరేడ్ కమాండర్, ఏఆర్‌డీఎస్పీ శేషాద్రి పర్యవేక్షణలో ఆర్మ్‌డ్ పోలీసు సిబ్బంది, పోలీసు బ్యాండ్ సిబ్బంది, స్కౌట్స్ విద్యార్థులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. ముందుగా సిబ్బంది నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కవాతును సమష్టిగా, సమన్వయంతో నిర్వహించి ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని సూచించారు. మైదానంలో వాహనాల పార్కింగ్, ట్రాఫిక్, భద్రత, బందోబస్తుపై అధికారులతో ఎస్పీ చర్చించారు. ఈ సాధన కార్యక్రమంలో ఏఎస్పీ డా.జి.ప్రేమ్‌కాజల్, ఆర్ఐ కె.నర్సింగరావు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ ప్రతినిధిగా నిమ్మాడ రైతు

- ఎర్రకోట వద్ద స్వాతంత్ర్య వేడుకలకు హాజరు
- ప్రకృతి వ్యవసాయం చేయడంలో దిట్ట

టెక్కలి/కోటబొమ్మాళి: ఢిల్లీలోని ఎర్రకోట వద్ద గురువారం జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధానమంత్రి కిసాన్ ప్రతినిధిగా కోటబొమ్మాళి మండలం నిమ్మాడ గ్రామా నికి చెందిన రైతు దోమ మోహనరావు ఎంపికయ్యాడు. ప్రకృతి వ్యవసాయం చేయడంలో మోహనరావు దిట్ట. ఎరువులు, పురుగు మందులు వంటివి లేకుండా కేవలం పశువుల గత్తంతో ప్రకృతి వ్యవసాయం చేస్తూ దిగుబడులు సాధిస్తుండడంతో వ్యవసాయాధికారుల దృష్టిలో పడ్డాడు. దీంతో రాష్ట్రం నుంచి నలుగురు రైతులు పీఎం కిసాన్ ప్రతినిధులుగా ఎంపికకాగా, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జోన్‌కు సంబంధించి మోహనరావు ఎంపికయ్యాడు. ఇప్పటికే మోహనరావు, పుణ్యవతి దంపతులు మంగళవారం న్యూఢిల్లీ చేరుకున్నారు. వీరికి ఢిల్లీలోని ఎస్‌జీటీ హోటల్ ప్రాంతంలో వసతి సౌకర్యం కల్పించారు. ఎర్రకోటలో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొని తిరిగి స్వగ్రామం వచ్చే వరకు రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యవసాయాధికారులు వారికి తోడుగా ఉండనున్నారు. పీఎం కిసాన్ ప్రతినిధిగా ఎంపిక కావడంపై మోహనరావు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేల తల్లిని నమ్ముకొని జీవిస్తున్నా..

నేను రైతు బిడ్డగా పుట్టి నేల తల్లిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నా. నాకు ఇప్పుడు 62 సంవత్సరాలు. 7వ తరగతి వరకు చదువుకున్నా. ఆ సమయంలో నా తండ్రి అప్పలస్వామి మరణించారు. దీంతో చదువు మానేసి వ్యవసాయ రంగానికి పరిమితమయ్యా. గత ఐదేళ్లుగా ప్రకృతి పంటలపై దృష్టిసారించా. రసాయన ఎరువులు, పురుగుమందులు అసలు వినియోగించను. పశువుల గత్తం, వివిధ పరిశ్రమల నుంచి వస్తున్న మొలాసిస్, తదితర సేంద్రియ ఎరువులను వాడటం ద్వారా అధిక దిగుబడులు సాధిస్తున్నా. వరి ఎకరాకు 20 నుంచి 25 బస్తాల దిగుబడి వస్తుంది. సన్నరకాలు, సుగర్‌లెస్ రకాలు మాత్రమే పండిస్తా. బస్తా రూ.3వేల చొప్పున పలువురు కొనుగోలు చేస్తుంటారు. వేరుశెనగ, పెసర, మినుము పంటలు సైతం పండిస్తుంటా. భూమిలో నత్రజని శాతం పెంచే దిశగా చర్యలు చేపట్టి మంచి ఫలితాలు సాధిస్తున్నా. సాగులో భార్య పుణ్యవతి సహకరిస్తుంది. మా పెద్దకుమారుడు అప్పలనాయుడు ఎంబీఏ పూర్తి చేసి శ్రీకాకుళం రిమ్స్‌లో, చిన్న కుమారుడు చిట్టినాయుడు బీటెక్ చదివి కేజీఎస్ ఆసుపత్రిలో ఉద్యోగాలు చేస్తున్నారు.'

-దోమ మోహనరావు, నిమ్మాడ



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో మోహనరావు, పుణ్యవతి దంపతులు

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్/శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 14: ప్రతీ పౌరుడిలో దేశభక్తిని పెంపొందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఆజాద్ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ కూడలి నుంచి ఏడురోడ్ల కూడలి వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏడురోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపైనా మువ్వెన్నెలా జెండా రెపరెపలాడాలన్నారు. దేశ సమగ్రత, జాతీయ సమైక్యతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గురువారం 80అడుగుల రోడ్డు నుంచి ఆర్అండ్‌బీ బంగ్లా వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామని, అందరూ భాగస్వాములు కావాలని కోరారు. హర్‌ఘర్ తిరంగా డాట్ కాం వెబ్‌సైట్‌లో సెల్ఫీలు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. తీర ప్రాంతంలో ఉన్న మత్స్యకారులను కార్యక్రమంలో భాగస్వామ్యం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతీ పంచాయతీలో జాతీయ సమైక్యతపై పోటీలు నిర్వహించాలన్నారు. ఈ పోటీల కోసం మేజర్ పంచాయతీకి రూ.25వేలు, మైనర్ పంచాయతీకి రూ.10వేలు చొప్పున నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సాయంత్రం జరిగే యట్‌హోం కార్యక్రమానికి జిల్లాకు చెందిన ప్రముఖులను ఆహ్వానించి, దేశభక్తి గీతాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మన్ మహమ్మద్‌ఖాన్, ఏఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, ఆర్డీవో సీహెచ్ రంగయ్య, కమిషనర్ చల్లా ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జిల్లా ఆర్మీ మేజర్‌కు కీర్తిచక్ర అవార్డు

- మొట్టమొదటి తెలుగు వ్యక్తి
- జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులతో సాహసోపేత పోరాటం



రాంగోపాల్‌నాయుడు

అరసవల్లి ఆగస్టు 14: జిల్లాకు చెందిన ఆర్మీ మేజర్ మల్లా రాంగోపాల్ నాయుడు దేశంలోనే ప్రతిష్ఠాత్మక ఆర్మీ కీర్తి చక్ర అవార్డుకు ఎంపికయ్యారు. రాంగోపాల్ మరాఠా లైట్ ఇన్‌ఫాంట్రీ, 56వ బెటాలియన్, రాష్ట్రీయ రైఫిల్స్ మేజర్‌గా పనిచేస్తుండగా గతేడాది అక్టోబరు 26న జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలోని నియంత్రణ రేఖ వద్ద ఐదుగురు ఉగ్రవాదులను గుర్తించారు. వెంటనే వారిపై సైనికులు దాడి చేశారు. వీరికి రాంగోపాల్ నాయకత్వం వహించారు. ఒక టెర్రరిస్ట్‌ను రాంగోపాల్ హతమార్చారు. మరొక ఉగ్రవాదిని గాయపర్చారు. తన దళానికి ప్రమాదాన్ని గుర్తించి అత్యంత సాహసంతో, ప్రాణాలకు తెగించి మరో ఉగ్రవాదిని అగ్నితో కాల్చివేశారు. అదే సమయంలో గుహలో దాక్కున్న మరో ఉగ్రవాదిని మట్టుబెట్టేందుకు రాంగోపాల్ ప్రాణాలను లెక్కచేయకుండా అటు వైపు వేగంగా పరుగెత్తారు. కానీ, తీవ్రవాది ఆయనపై గ్రెనేడ్లు విసిరాడు. అయినా సరే వెరవకుండా, వాటి నుంచి వెంట్రుకవాసిలో తప్పించుకుంటూ ఉగ్రవాదిని బంధించారు. సైనికుల ప్రాణాలను కాపాడడం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టడం, క్లినికల్ ఆపరేషన్‌ను ప్లాన్ చేయడం, ఆ ప్లాన్‌ను అమలు చేయడం వంటి గొప్ప నాయకత్వ లక్షణాలను ప్రదర్శించినందుకు గాను రాంగోపాల్‌ను కీర్తిచక్ర అవార్డుకు ఆర్మీ ఉన్నతాధికారులు సిఫారసు చేశారు. ఈ మేరకు ఈ ఏడాది కీర్తిచక్ర అవార్డుకు నలుగురు ఎంపిక కాగా, అందులో రాంగోపాల్ ఒకరు. సజీవంగా ఉంటూ ఈ అవార్డుకు ఎంపికైన మొట్టమొదటి తెలుగు వ్యక్తి రామ్‌గోపాల్ కావడం విశేషం. స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటివరకు దేశంలో 496 మంది సైనికులు కీర్తి చక్ర అవార్డులకు ఎంపికయ్యారు. అయితే, తెలుగు రాష్ట్రాల్లో రామ్‌గోపాల్ తొలి వ్యక్తి కావడం విశేషం. ఈయనది సంతబొమ్మాళి మండలం, నగిరిపెంట గ్రామం. తండ్రి అప్పలనాయుడు టీచర్, తల్లి హేమలత గృహిణి. రాంగోపాల్ కోరుకొండ సైనిక్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుకున్నారు. అనంతరం ఎన్డీఏకు ఎంపికయ్యారు. అతను కీర్తిచక్ర అవార్డుకు ఎంపిక కావడం జిల్లాకు, రాష్ట్రానికే గర్వకారణం. గురువారం ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా రాంగోపాల్‌నాయుడు ఈ అవార్డును అందుకోనున్నారు.

చేప ముల్లు గుచ్చుకుని..

- మంగుళూరులో జిల్లా మత్స్యకారుడి మృతి
- వలస వెళ్లిన 16 రోజుల్లోనే..
- తండ్రి ఒడిలోనే ప్రాణాలు వదిలిన వైనం
- నర్సయ్యపేటలో విషాదం



పోలీసు (ఫైల్)



తండ్రి ఒడిలో మృతి చెందిన పోలీసు

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 14: కుటుంబ పోషణ కోసం ఆ మత్స్యకారుడు పదహారు రోజుల కిందట కర్ణాటక రాష్ట్రం మంగుళూరుకు వలస వెళ్లాడు. అక్కడ సముద్రంలో వేటకు వెళ్లగా ఓ చేప ముల్లు గుచ్చుకుంది. దీంతో తీవ్ర అనార్యోగానికి గురయ్యాడు. చివరకు ఆరోగ్యం క్షీణించి తండ్రి ఒడిలోనే ప్రాణాలు వదిలాడు. శ్రీకాకుళం రూరల్ మండలం నర్సయ్యపేట గ్రామానికి చెందిన కొమర పోలీసు (39) అనే మత్స్యకారుడు 2011లో రేవతి అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానికంగా కొంతకాలంగా సరైన పనిలేక కుటుంబ పోషణ కష్టమయింది. దీంతో తన తండ్రి అవతారంతో కలిసి గత నెల 28న మంగుళూరు వలస వెళ్లాడు. అక్కడ పోలీసుకు చేపల వేట పని దొరకగా, తండ్రి అవతారానికి ఒడ్డున వలలు అల్లుకునే పని లభించింది. కొన్ని రోజుల కిందట చేపల వేటకు వెళ్లిన పోలీసుకి సముద్రంలో ఓ చేప ముల్లు గుచ్చుకుంది. దీంతో అనారోగ్యానికి గురికావడంతో ఒడ్డుకు వచ్చి చికిత్స తీసుకున్నాడు. విశ్రాంతి తీసుకుంటే కుటుంబ పోషణ భారమవుతుందని మళ్లీ బోటులో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో పోలీసు ఆరోగ్యం క్షీణించింది. ఒడ్డుకు తీసుకెళ్లాలని బోటులోని తోటి మత్స్యకారులను రెండు రోజులుగా వేడుకున్నా పట్టించుకోలేదు. చివరకు సముద్రంలో దూకాడు. దీంతో అతన్ని కాపాడి ఈ నెల 12న ఒడ్డుకు తీసుకుని వచ్చారు. అక్కడే వలలు పని చేసుకుంటున్న తండ్రిని పిలిచి అతని ఒడిలో తలపెట్టుకుని.. చేప విషం తన ఒంటి నిండా పాకేసిందని, ఆస్పత్రికి తీసుకెళ్లాలని, తానింక బతకనేమోనని చెబుతూనే ప్రాణాలు విడిచాడు. తోటి మత్స్యకారులు దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న భార్య రేవతి, తల్లి దుర్గమ్మ బుధవారం మంగుళూరు చేరుకున్నారు. ఆస్పత్రిలో విగతజీవిగా ఉన్న పోలీసుని చూసి భోరున విలపించారు. మంగుళూరు ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం సాయంత్రం పోస్టుమార్టం పూర్తయింది. గురువారం అక్కడే అంత్యక్రియలు చేయనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఆసుపత్రి వద్ద రోదిస్తున్న భార్య రేవతి

ప్రభుత్వం ఆదుకోవాలి..

పోలీసు మృతితో నర్సయ్యపేటలో విషాదచాయలు అలముకున్నాయి. మత్స్యకార నాయకుడు కోనాడ నర్సింగరావు.. పోలీసు కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులను పూర్తిగా పట్టించుకోలేదన్నారు. దీంతో వారికి వలసలు తప్పడం లేదన్నారు. ఇలా వెళ్లిన వారంతా సరిహద్దులో పక్క దేశ కోస్టుగార్డులకు చిక్కడం, లేదంటే మరణించడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల శ్రీలంక కోస్ట్‌గార్డులకు చినగనగళ్లవానిపేటకు చెందిన ఇద్దరు మత్స్యకారులు చిక్కారని, వారు విడుదల కాకముందే మంగుళూరులో మరో మత్స్యకారుడు మృతి చెందడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు.

తోటి మత్స్యకారులే కారణం..

సముద్రంలో చేపల వేటకు వెళ్లిన నా కొడుకు పోలీసు ఆరోగ్యం క్షీణించింది. ఒడ్డుకు తీసుకెళ్లాలని బోటు డ్రైవర్‌ను రెండు రోజులుగా కోరినా పట్టించుకోలేదు. దీంతో సముద్రంలో దూకేశాడు. దీంతో కాపాడి ఒడ్డుకు తెచ్చారు. చనిపోయే ముందు ఈ విషయం నాకు చెప్పి బాధపడ్డాడు. నా కొడుకు చావుకు కారణం తోటి మత్స్యకారులు, బోటు ఓనరే. వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-అవతారం, మృతుడి తండ్రి

వ్యక్తి ఆత్మహత్య

ఇచ్ఛాపురం: పట్టణంలోని ఓ లాడ్జిలో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగు చూసింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్టణ పరిధి ఆరిలోవ కాలనీకి చెందిన దొడ్డి మంగరాజు(47) మద్యానికి బానిసై కుటుంబాన్ని పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నాడు. తన ఫ్యామిలీ ఫ్రెండ్ కుమ్మరి జగదీష్ భువనేశ్వర్‌లో ఉంటున్నాడు. మూడు నెలల కిందట అతడి వద్దకు వెళ్లి పనిచూడమని చెప్పాడు. మూడు నెలల పాటు అక్కడే ఉన్నా మద్యం తాగడం మానకపోవడంతో ఇంటికి పంపించేశారు. దీంతో ఈనెల 9న భువనేశ్వర్‌లో బయలు దేరిన మంగరాజు ఇచ్ఛాపురం చేరుకుని ఓ లాడ్జిలో రూమ్ తీసుకుని ఉంటున్నాడు. బుధవారం లాడ్జి సిబ్బంది బెల్, తలుపులు ఎంత కొట్టినా తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపు పగలు గొట్టారు. లోపలకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని మంగరాజు విగతజీవిగా ఉన్నాడు. దీంతో లాడ్జి యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ ఎస్‌ఐ లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..


రమేష్(ఫైల్)

ఎచ్చెర్ల: ఎచ్చెర్లకు సమీపంలోని పాత జాతీయ రహదారిపై ఓ వ్యక్తి అనుమానా స్పద స్థితిలో మృతి చెందాడు. బుధవారం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. లావేరు మండలం బుడుమూరు కాలనీకి చెందిన కింతలి రమేష్(43) ఎచ్చెర్ల సమీపంలోని పాత జాతీయ రహదారికి పక్కన పడి ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా ఆ వ్యక్తి చనిపోయినట్టు గుర్తించారు. మృతుడి శరీరంపై ఎటువంటి గాయాలు లేవని, మృతికి గల కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు. కాగా రమేష్‌కు గతంలో వివాహం జరగగా.. భార్య నుంచి విడాకులు తీసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

వైద్యుడి నిర్లక్ష్యం వల్లే పసికందు మృతి

● తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన


మృత శిశువుతో ఆందోళన చేస్తున్న బంధువులు

ఇచ్ఛాపురం: పట్టణంలో గల ఓ ప్రైవేట్ ఆసుపత్రి వైద్యుడి నిర్లక్ష్యం వల్లే అప్పుడే పుట్టిన పసికందు మృతి చెందినట్టు తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు ఆ ఆసుపత్రి ఎదుట మృతి చెందిన పసికందుతో ఆందోళన చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం పట్టణానికి చెందిన శివప్రసాద్‌కి ఇచ్ఛాపురం పట్టణ పరిధి కృష్ణానగర్‌కు చెందిన త్రివేణి మహంతితో వివాహం జరిగింది. డెలివరీ కోసం కన్నవారి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో ఇచ్ఛాపురం పట్టణంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో ప్రతీ నెలా చూపించేవారు. పదో నెల వచ్చినా డెలివరీ కాకపోవడంతో మంగళవారం ఆ నర్సింగ్‌హోమ్‌లో చేర్పించారు. పురిటి నొప్పులతో బాధపడుతున్నా అక్కడి వైద్యుడు పట్టించుకోకపోవడంతో బుధవారం పురటిలోనే మగశిశువు మృతి చెందింది. దీంతో ఆగ్రహంతో బంధువులు ఆ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. అనంతరం పోలీసులను ఆశ్రయించారు.

ట్రావెల్ బస్సు ఢీకొని దంపతులకు గాయాలు

శ్రీకాకుళం క్రైం: సింగుపురం వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలను వెనుక నుంచి వస్తున్న ఓ ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. రిమ్స్ ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఫరీద్‌పేటకు చెందిన సత్తారు నాగరాజు తన భార్య జ్యోతితో ద్విచక్ర వాహనంపై పలాస వెళ్తున్నాడు. సింగుపురం వచ్చేసరికి అదే మార్గంలో వస్తున్న ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టింది. దీంతో నాగరాజు, అతడి భార్య జ్యోతి రోడ్డుపై పడిపోగా బండి బస్సు కిందకు వెళ్లిపోయింది. గాయపడిన భార్యాభర్తలిద్దరికి తెలివి లేకపోవడంతో ద్విచక్రవాహనాన్ని పక్కకు నెట్టి వెళ్లిపోయాడు. ఇది గమనించిన ప్రయాణికులు క్షతగాత్రులను లేపి బస్సును ఆపేందుకు ప్రయత్నించగా ఆపకుండా వెళ్లిపోయాడు. కాగా క్షతగాత్రులను 108 వాహనంలో రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. ఇదిలా ఉండగా జ్యోతి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో ఆమెను జెమ్స్‌కు తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులకు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ వాసునారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

కొయ్యరాళ్ల జంక్షన్ వద్ద ఒకరికి..

ఎచ్చెర్ల: కొయ్యరాళ్ల జంక్షన్ (ఫరీద్‌పేట) జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో శ్రీకాకుళం రూరల్ మండలం తండేంవలస గ్రామానికి చెందిన ఎ.కామరాజు గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కామరాజు ద్విచక్రవాహనంపై శ్రీకాకుళం వైపు వస్తుండగా.. సర్వీసు రోడ్డు నుంచి ప్రధాన రహదారిపైకి వెళ్లే క్రమంలో ఓ కారు ఢీకొనడంతో కామరాజు గాయపడ్డాడు. గాయపడ్డ అతడిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థల వివాదంలో కేసులో ఒకరి జరిమానా

పొందూరు: ఇల్లయ్యగారిపేట గ్రామంలోని స్థలవివాదంలో కొంచాడ అసిరమ్మను ఇనుప గజంతో కొట్టి గాయపరిచిన కేసులో నేరం రుజువుకావడంతో సింహాచలానికి రూ.5 వేలు జరిమానా విధిస్తూ పొందూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి జ్యోత్స్న తీర్పు చెప్పినట్టు ఎస్‌ఐ పీవీ రమణ తెలిపారు. జరిమానా కట్టకపోతే ఆరు నెలలు జైలుశిక్ష విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు. 2022 నవంబరు 2 జరిగిన ఈ వివాదంపై అప్పటి ఎస్‌ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున ఆర్.శాంతి సంతోషి వాదనలు వినిపించారు.

వైద్యురాలి హత్యకు నిరసనగా ర్యాలీ

అరసవల్లి: కోల్‌కతాలో హత్యాచారానికి గురైన వైద్యురాలి కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని రిమ్స్ జూనియర్ డాక్టర్లు బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేసి, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిమ్స్ నుంచి స్థానిక డే అండ్ నైట్ జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఏపీ జూ.డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేష్, పూర్వ అధ్యక్షుడు అంబేడ్కర్, ఉపాధ్యక్షుడు ఎన్.మోహిత్‌కుమార్, కార్యదర్శి రాజ్‌కుమార్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఏబీ రోడ్డు గుంతలో ఇరుక్కున్న లారీ


గుంతలో ఇరుక్కున్న లారీ

సరుబుజ్జిలి: మండల కేంద్రమైన సరుబుజ్జిలి జంక్షన్ ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఏబీ రహదారి గుంతలో మంగళవారం రాత్రి భారీ వాహనం ఇరుక్కుంది. ఓ పార్శిల్ ట్రాన్స్‌పోర్టు లారీ గుంతలో ఇరుక్కుపోయింది. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో భారీస్థాయిలో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ఎక్స్‌కవేటర్ సాయంతో ఇరుక్కున్న లారీని బయటకు తీసి రాకపోకలు పునరుద్ధరించారు. ఇక్కడ ఏడాదికి పైగా ఈ సమస్య ఉన్నా సంబంధిత అధికారులు తాత్కాలిక పనులతో చేతులు దులుపుకుంటున్నారని స్థానికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి పాలనలో రైతే రాజు



గార: గత ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించకపోవడంతో నష్టపోయిన రైతులకు కూటమి పాలనలో రైతే రాజుగా పాలన జరుగుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం లింగాలవలస లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద వంశధార కుడి కాలువలోకి సాగునీటిని ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో జలవనరులు శాఖ అధికారులు, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

స్వతంత్ర పోరులో సిక్కోలు యోధులు

భరతమాతను దాస్య శృంఖలాల నుంచి విముక్తి చేసేందుకు జిల్లాకు చెందిన ఎంతో మంది త్యాగధనులు పోరాటం చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. ఈ పోరాటంలో ఎంతో మంది జైలు జీవితం గడపగా.. మరికొందరు వీర మరణం పొందారు. గురువారం స్వతంత్ర దినోత్సవం సందర్భంగా సిక్కోలు సమరయోధులపై ప్రత్యేక కథనం..

భూస్వామి కుటుంబం నుంచి చౌదరి సత్యం


చౌదరి సత్యనారాయణ

ఎచ్చెర్ల: స్వాతంత్ర్యోద్యమంలో గౌతు లచ్చన్న అనుచరుడిగా ఎచ్చెర్ల మండలం ఎస్ఎం పురం గ్రామానికి చెందిన చౌదరి సత్యనారాయణ (సత్యం) ప్రముఖ పాత్ర పోషించారు. భూస్వామి కుటుంబంలో పుట్టిన సత్య నారాయణ విద్యార్థి దశలోనే ఉద్యమబాట పట్టారు. రెవెన్యూ ఉద్యోగానికి రాజీనామా చేసి జాతీయోద్యమంలో భాగస్వామ్యులయ్యారు. ఇదే మండలం కొత్తపేట గ్రామానికి చెందిన బొడ్డేపల్లి నారాయణ, మొదలవలస కృష్ణమూర్తి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. బొంతల కోడూరు గ్రామానికి చెందిన చేనేత కార్మికులు మహాత్మా గాంధీ దూసి రైల్వే స్టేషన్ వద్ద దిగినప్పుడు చేనేత వస్త్రాలు బహూకరించారు.

ఉద్యమంలో చురుకైన పాత్ర

1921లో స్వాతంత్ర్య పోరాటంలో విద్యార్థులు పాల్గొనాలని జాతీయ కాంగ్రెస్ ఇచ్చిన పిలుపు మేరకు తరగతుల బహిష్కరణ ఉద్యమానికి చౌదరి సత్యనారాయణ నాయకత్వం వహించారు. విద్యార్థి దశలోనే సత్యనారాయణ బ్రిటీష్ పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నారు. 1926లో గాంధీజీ ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం వరకు చేపట్టిన యాత్రలో పాల్గొన్నారు. 1930 ఏప్రిల్ 19న నౌపడలో రామలింగం మాస్టారు నాయకత్వాన ఉప్పు కుప్పల దోపిడీలో పాల్గొన్నారు. 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. కళింగపట్నం తపాలా కార్యాలయాన్ని లచ్చన్న, శిల్లా రాజులరెడ్డి, చౌదరి సత్యనారాయణ నాయకత్వంలో లూటీ చేశారు.

ఎమ్మెల్యేగా సైకిల్‌పైనే..

1955లో షేర్‌మహమ్మద్ పురం (ఎస్‌ఎం పురం) నుంచి కృషికార్ పార్టీ తరపున శాసనసభకు ఎన్నికయ్యారు. 1962లో స్వతంత్ర పార్టీలో చేరి.. 1967లో విశాఖ ఉక్కు ఉద్యమంలో పాల్గొన్నారు. 1967లో పొందూరు నియోజకవర్గం నుంచి స్వతంత్ర పార్టీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 12 ఏళ్ల పాటు శాసనసభ్యుడిగా వ్యవహరించిన సత్యనారాయణ ప్రధాని ఇందిరాగాంధీ చేతుల మీదుగా స్వాతంత్ర సమరయోధులకు ఇచ్చే అత్యున్నత పురస్కారం తామర పత్రం అందుకున్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టి ఎమ్మెల్యేగా రెండు సార్లు ఎన్నికైన చౌదరి సత్యనారాయణ నిరాడంబరంగా జీవితాన్ని గడిపారు. సైకిల్‌పైనే బాధిత వ్యక్తులను కూర్చొబెట్టుకుని సంబంధిత కార్యాలయాలకు వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కాగా ఈ పెద్ద కుమారుడు చౌదరి తేజేశ్వరరావు సీపీఎం రాష్ట్ర నాయకుడిగా ఉన్నారు. చిన్న కుమారుడు చౌదరి నారాయణమూర్తి టీడీపీలో సీనియర్ నేతగా ఉన్నారు.

బలహీన వర్గాల నాయకుడిగా సర్దార్ లచ్చన్న

పలాస: స్వాతంత్రోద్యమ యోధుడు, ఆంధ్ర రైతోద్యమ రథసారథిగా సర్దార్ గౌతు లచ్చన్న కీర్తి గడించారు. ఆయన మరణానంతరం లచ్చన్న జయంతోత్సవాలను ప్రభుత్వ పండుగగా నిర్వహించడం ఆయన పోరాట పటిమకు నిదర్శనంగా చెప్పవచ్చు. గౌతు లచ్చన్న 1909 ఆగస్టు 16న శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బారువ గ్రామంలో నిరుపేద గీత కార్మిక కుటుంబం గౌతు చిట్టయ్య, రాజమ్మ దంపతులకు జన్మించారు. 1930 జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు జీవితం గడిపారు. ఇది లచ్చన్న జీవితం ప్రథమ ఘట్టంగా చెప్పవచ్చు. 1938 నవంబరు 7న ఇచ్ఛాపురం నుంచి మద్రాస్‌కు ఆంధ్రరాష్ట్ర రైతాంగ రక్షణ మహాయాత్ర నిర్వహించి చరిత్రపుటల్లో ఎక్కారు. అదే ఏడాది పలాసలో కిసాన్ మహాసభలు నిర్వహించి దేశం నలుమూలల నుంచి నాయకులను ఆహ్వానించి విజయవంతం చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం ఫలితంగా ఏర్పడిన భాషాప్రయుక్త రాష్ట్రాల విభజన కమిషన్ సిఫార్స్ మేరకు కేంద్ర ప్రభుత్వం 1956లో ఫిబ్రవరి 20న పెద్దమనుషుల కమిటీ వేసింది. బూర్గుల రామకృష్ణారావు, కేవీ రంగారెడ్డి, ఎం.చెన్నారెడ్డి, జీవీ నర్సింగరావుతో కూడిన ఈ కమిటీలో లచ్చన్న ఒకరు. టంగుటూరు ప్రకాశం పంతులు మంత్రి వర్గంలో చేరి పదవిని అలంకరించారు. ఆయన జీవితాంతం బడుగు, బలహీనవర్గాల కోసమే పోరాటం చేశారు. ఆయన సేవలను గుర్తించి అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం లచ్చన్న, ఆచార్య ఎన్‌జీ రంగా విగ్రహాలను శ్రీకాకుళం నగరంలోని డేఅండ్‌నైట్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసి సముచిత గౌరవాన్ని ఇచ్చింది. సర్దార్ గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19న కన్నుమూశారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో ఆయన విగ్రహాలు అనేక ప్రధాన పట్టణాల్లో నెలకొల్పారంటే ఆయన పోరాట స్ఫూర్తికి నిదర్శనంగా చెప్పవచ్చు.


నాటి ప్రధాని నీలం సంజీవరెడ్డితో గౌతు లచ్చన్న కుటుంబం

ఈనాందార్ కుటుంబం నుంచి కృష్ణమూర్తి


అట్టాడ కృష్ణమూర్తి

శ్రీకాకుళం కల్చరల్: నందిగాం మండలం పెంటూరు గ్రామానికి చెందిన ఈనాందార్ అట్టాడ అప్పలనాయుడు కుమారుడు కృష్ణమూర్తి (1902-77). ఈనాందార్ కుటుంబంలో జన్మించినా సాతంత్ర్య సమరంలో కృష్ణమూర్తి తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. 7వ తరగతి చదువుతున్న సమయంలోనే పాఠశాల బహిష్కరణ ఉద్యమం ద్వారా చదువుకు స్వస్తి చెప్పి స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారు. స్వాతంత్ర్య సమర యోధులు పుల్లెల శ్యామ్ సుందరరావు, పొట్నూరు సోంబాబులకు ఆయన సమకాలీకుడు. మాజీ రాష్ట్రపతులు వరాహ వెంకటగిరి, నీలం సంజీవరెడ్డి, బాబూ రాజేంద్ర పసాద్, ఆచార్య ఎన్జీ రంగా తదితరులతో కృష్ణమూర్తికి అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండేవి. 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. స్వతంత్ర సమరయోధులకు భారత ప్రభుత్వం ఇచ్చిన పింఛన్, భూమి, ఇతర ప్రయోజనాలను అట్టాడ కృష్ణమూర్తి నాయుడు తీసుకోలేదు. సాతంత్ర్యం అనంతరం జిల్లా బోర్డు తొలి మెంబర్‌గా, నందిగాం పంచాయతీ ప్రెసిడెంట్‌గా, కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్‌గా, టెక్కలి శ్రీరామకోపరేటివ్ మార్కె టింగ్ సొసైటీ ప్రెసిడెంట్‌గా సేవలందించారు. 1977లో ఆయన మరణించే నాటికి భార్య వెంకటరత్నం, కుమారులు అట్టాడ అప్పలనాయుడు (న్యాయవాది), అట్టాడ రాఘవరావు (న్యాయవాది), కుమార్తె పొందల జయకుమారి ఉన్నారు.

ధీరవనిత వీరగున్నమ్మ

హరిపురం: శ్రమజీవుల కడగండ్లు తీర్చే లక్ష్యంతో జమిందారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడుతూ తెల్ల దొరల తుపాకులకు అమరురాలైన ధీరవనిత శాసుమాను గున్నమ్మ. జానపదాల్లో నేటికీ ఆమెకు సముచిత స్థానం దక్కిందంటే వారి హృదయాల్లో ఆమెకు ఉన్న స్థానం ఇట్టే అర్థమవుతుంది. మందస మండలం గుడారి రాజమణిపురానికి చెందిన గున్నమ్మ 1940 ఏప్రిల్ 1న జరిగిన చరిత్రాత్మక మందస పోరాటంలో పోరాడి అశువులు బాసి వీరగున్నమ్మగా చరితార్థురాలైంది. ఆమె పోరాటానికి గుర్తింపుగా గ్రామ సరిహద్దులో ఆమె పేరిట స్వాగత ద్వారం ఏర్పాటు చేసి గ్రామస్థులు నేటికీ ఆమెను స్మరించుకుంటు న్నారంటే ఆమె పోరాటపటిమే కారణం.

స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా 1940 మార్చి 26, 27 తేదీల్లో పలాసలో అఖిలభారత కిసాన్ జాతీయ మహాసభలు జరగ్గా రైతులు పెద్ద ఎత్తున హాజరై తిరుగు ప్రయాణంలో అడవిలోని కలపను తీసుకువస్తుండగా మందస కోట ఎదు రుగా బ్రిటీష్ పాలకులు నాటుబళ్లవిప్పి పశువులను వదిలేశారు. దీంతో రైతులంతా మూకమ్మడిగా తిరగబడ్డారు. మార్చి 30న తాలుకా మెజిస్ట్రేట్, ఎస్‌ఐ, బ్రిటీష్ పోలీసులతో కలిసి జీఆర్ పురం వచ్చారు. తనిఖీలు నిర్వహించి ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఏప్రిల్ 1న సబ్ కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులు గ్రామానికి వచ్చి కేసు నమోదు చేసిన వారిని జైలుకు తరలించే ఏర్పాట్లు చేయగా రైతులంతా ఎదురుతిరిగారు. దీంతో రైతు సంఘ నాయకులు మార్పు పద్మనాభం, జగన్నాథం, మహంతి నారాయణలను అరెస్టు చేయడంతో రైతులకు, బ్రిటీష్ పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. రైతులకు నాయకత్వం వహించిన సాసుమాను గున్నమ్మ తెగువను చూసి బీతిల్లిపోయిన పోలీసులు కాల్పులు జరిపారు. నాటి పోరాటంలో గున్నమ్మతో పాటు రైతులు గొర్లె జగ్గయ్య, కర్రి కలియాడు, గుంట చిననారాయణ, గుంట చక్రపాణి, కానిస్టేబుల్ దొడ్డాల రంగారావు అశువులు బాశారు. వీరి వీరత్వాన్ని గుర్తుచేసుకుంటూ గ్రామంలో ఏర్పాటు చేసిన స్మారక చిహ్నాన్ని 1988 సెప్టెంబరు 10న నాటి గవర్నర్ కుముద్ బెన్ జోషీ ఆవిష్కరించి ఆమె త్యాగాలను స్మరించుకున్నారు. పోరాటంలో ఎంతో వీరత్వాన్ని చూపి చివరకు అశువులు బాసిన వీరవనిత సాసుమాను గున్నమ్మ పేరుతో గుడారి రాజమణిపురం గ్రామాన్ని వీరగున్నమ్మపురంగా ప్రభుత్వం నామకరణం చేసింది. వీరనారి ఇతివృత్తం ఆధారంగా ఇప్పటికే తెలుగు సినిమా రూపుదిద్దుకోగా, గున్నమ్మ జీవిచరిత్రను పాఠ్యాంశంగా రూపొందించాలని స్థానికులు కోరుతున్నారు. మందస జమీందారీ వ్యతిరేక పోరాటంలో గున్నమ్మ మరణించగా, పోరాటంలో ముందు నిలిచిన పున్నమ్మ జైలు జీవితం అనుభవించింది.


వీరగున్నమ్మ స్మారక స్థూపం

ఎందరో వీరవనితలు

స్వాతంత్ర్య పోరాటంలో కొంతమంది సిక్కోలు మహిళలు కూడా మేము సైతం అంటూ భాగస్వామ్యమయ్యారు. నరసన్నపేట కు చెందిన టంకాల సుందరమ్మ, అంధవరపు వెంకటరమణమ్మ, కప్పగంతుల ఆదిలక్ష్మి, టెక్కలికి చెందిన మంత్రాల రామసుబ్బమ్మ, శ్రీకాకుళానికి చెందిన సీహెచ్ సత్యభామబాయి, బొద్దాంకు చెందిన శిష్టం శ్యామసుందరమ్మ, వీరగునమ్మపురానికి చెందిన గున్న లక్ష్మీనరసమ్మ, శేషమ్మలతో పాటు మంత్రాల రామసీతమ్మ, పూడిపెద్ది రమణమ్మ, పోకల తారమ్మ, ఆమదాలవలసకు చెందిన బులుసు వెంకటరత్నం, పలాసకు చెందిన కొంచాడ వెంకమ్మ తదితరులు స్వతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలు జీవితాన్ని అనుభవించారు.

రిమ్స్ వైద్యుల నిర్లక్ష్యంపై విచారణకు ఆదేశం

శ్రీకాకుళం అర్బన్: రణస్థలంలోని బీరు ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుడు సన్యాసినాయుడుని మంగళవారం లారీ ఢీకొని గాయపడ్డాడు. ఈ ఘటనలో చికిత్స కోసం రిమ్స్‌కు తీసుకురాగా వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించారంటూ బంధువులు ఆరోపించారు. దీంతో ఈ ఘటనపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విచారణకు గురువారం ఆదేశించారు. క్షతగాత్రుడికి వైద్యం అందించాల్సిన వైద్య సిబ్బంది గంటపాటు పట్టించుకోలేదని వచ్చిన ఆరోపణలపై ఆర్డీవో రంగయ్య, శ్రీకాకుళం తహసీల్దార్ గణపతిరావులను విచారణాధికారులుగా నియమించారు. ఈ మేరకు వారిద్దరు రిమ్స్‌లో బుధవారం విధులు నిర్వహించిన డ్యూటీ డాక్టర్లు, సిబ్బందిని విచారించి నివేదికను కలెక్టర్ అందించినట్టు సమచారం. ఈ నివేదికపై సంతృప్తి చెందని కలెక్టర్.. డీఎంహెచ్‌వో బి.మీనాక్షిని మరోసారి విచారించాలని ఆదేశించారు. దీంతో ఆమె రిమ్స్‌లో మరోసారి విచారణ చేపట్టారు. ఈ సారి అంబులెన్స్ డ్రైవర్‌ను కూడా ఆమె విచారించగా.. 15 నిమిషాల పాటు ఎవరు రాకపోవడం వాస్తవమేనని, గొడవ జరుగుతున్న సందర్భంలో వైద్య సిబ్బంది బొమ్మల్లా ఉండిపోయినట్టు తెలిపారు. ఆ సమయంలో తీసిన వీడియోలో ఇద్దరు సెక్యూరిటీ గార్డులు ఉండటాన్ని గమనించిన డీఎంహెచ్‌వో వారిని కూడా విచారించారు. ఆ సమయంలో మీరైనా మానవత్వంతో స్పందించాల్సింది కదా అని డీఎంహెచ్‌వో వారిని ప్రశ్నించగా.. అది తమ పనికాదని వారు బదులిచ్చారు. ఇదే విషయంతో నివేదికను కలెక్టర్‌కు ఇచ్చినట్టు తెలుస్తుంది.

రూపాయి సరే.. మిగిలిన సొమ్ము ఏమైంది?

● హౌసింగ్ అధికారులతో ఎమ్మెల్యే అశోక్ సమీక్ష

కవిటి: గతంలో గృహలబ్ధిదారులకు రూపాయి చొప్పున వారిఖాతాలో వేసి ఆ తర్వాత మిగిలిన సొమ్ము వేయకపోవటానికి కారణమేంటని ఎమ్మెల్యే బి.అశోక్ ప్రశ్నించారు. రామయ్యపుట్టుగలో హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. ఏటా ఎన్టీఆర్ గృహకల్ప కింద లబ్ధిదారులకు రూపాయి వేసి నిలుపుదల చేశారే తప్ప మిగిలిన చెల్లింపులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఇలా నియోజకవర్గంలో ఎంతమంది లబ్ధిదారులు ఉండిపోయారో చెప్పాలని పీడీ నగేష్, సిబ్బందిని అడిగారు. అందుకు తమ వద్ద సమాచారం లేదని చెప్పటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నేతల సహకారంతో జాబితాను సిద్ధంచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించిన ఎమ్మెల్యే అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ● వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎమ్మెల్యే అశోక్ జిల్లా అగ్నికులక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, జిల్లా సంఘ అధ్యక్షుడు జి.వసంతస్వామితోపాటు కుల సంఘ నాయకులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

అలరించిన జనజాగరణ

శ్రీకాకుళం కల్చరల్: బాపూజీ కళామందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ సందరకభంగా సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం వినోద విజ్ఞాన సృజనాత్మకత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భూమికి పచ్చని అంటూ కోలాటం, విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వీరులారా వందనం డాన్స్ కార్యక్రమం, పాడుదమా స్వేచ్ఛాగీతం. ఎగరేయుదామా జాతియ పతాకం అంటూ శ్రీనివాసరం పాడుతూ దేశభక్తిని రగిలించారు. అదేవిధంగా దేశం మనమంతా అంటూ చిన్నారులు పాటలు, నృత్యం అలరించింది. ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో మ్యాజిక్ షో, మధ్యాహ్న భోజన పథకం కార్మికులచే నృత్యం, వెలుగు సంస్థ ఆధ్వర్యంలో డ్యాన్స్, అంగన్‌వాడీ యూనియన్ కార్మికులచే డ్యాన్స్ కార్యక్రమం అలరించాయి.

కరకట్టల ఏర్పాటుపై పరిశీలన

బూర్జ: మండలంలోని జిబిపురం, అల్లెన గ్రామాల్లో ఇరిగేషన్ డీఈఈ రమేష్, ఏఈఈ జి.కార్తీక్, ఏఈఈ యశ్వంత్‌లు కరకట్టల ఏర్పాటుపై బుధవారం పరిశీలన చేశారు. నాగావళి నది పరివాహక గ్రామాలైన జీబీపురం, అల్లెన గ్రామాల్లో కరకట్టల లేకపోవడంతో అక్కడ ఉన్న ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచనలు చేయడంతో ఇరిగేషన్ అధికారులు పరిశీలన చేపట్టారు. ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని అధికారులు తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆమదాలవలస: పెన్షనర్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరంచాలని పెన్షనర్ల సంఘ గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి మోహన్‌రావు, కోశాధికారి హెచ్‌వీ సత్యనారాయణ, డి.లక్ష్మణరావు ఖజానా అధికారులను కోరారు. బుధవారం పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో సబ్ ట్రెజరీ అధికారులు సి.హెచ్.చంద్రశేఖర్, కె.మనోహర్ సమక్షంలో సమావేశం ఏర్పాటు చేశారు. కార్య క్రమంలో పెన్షనర్ల సంఘ సభ్యులు ఎస్.వాసుదేరావు, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు రాజీపై దృష్టి పెట్టాలి

● జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి మౌలానా

గుజరాతీపేట: జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసే దిశగా దృష్టిసారించాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. స్థానిక జిల్లా కోర్టు భవనంలో ఇన్సూరెన్స్ కంపెనీలతో, న్యాయవాదులతో, బ్యాంకర్లతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్ కేసులను, బ్యాంకు సంబంధిత కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు వై.సూర్యారావు, ఎల్.గోవిందరాజులు, ఎం.జనార్థన, బిఎస్.చలం, కెజీవరత్నం, బ్యాంకు ప్రతినిధులు, ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సదస్సులు

కలెక్టరేట్: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సదస్సుల నిర్వహణకు ప్రణాళికతో యంత్రాంగం సమాయత్తం కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి సదస్సుల ముందస్తు ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో 45 రోజుల పాటు సదస్సుల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ప్రధానంగా మ్యుటేషన్, వెబ్‌ల్యాండ్‌లో తప్పుల సవరణ, 1బీ, దారి సమస్యలు, భూ తగాదాలు ఎక్కువగా ఉంటాయని, ఇందుకు అవసరమైన రికార్డులను అధికారులు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే 22ఏ, ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించిన విషయాలను పరిశీలించి, రికార్డులను ముందుగానే తయారు చేసుకోవాలన్నారు. ● శ్రీకాకుళం, నరసన్నపేట, ఎచ్చెర్ల శాసనసభ్యులు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామాల్లో రెవె న్యూ భూ తగాదాలు ఎక్కువగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి గ్రామానికి వెళ్లి పరిష్కారం చూపించడం శుభపరిణామమన్నారు. రీసర్వే అంతా గందరగోళమని, ఈ సదస్సులను ప్రతీ ఒక్కరూ వినియోగించుకుని తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పీఎంజే బాబు(టీడీపీ), బిర్లంగి ఉమామహేశ్వరరావు(బీజేపీ), రౌతు శంకరరావు(వైసీపీ), డిఆర్వో అప్పారావు, టెక్కలి, పలాస ఆర్డీవోలు సుదర్శనదొర, భరత్‌నాయక్, మండల తహశీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు, తదితరులు హాజరయ్యారు.

దువ్వాడ వ్యవహారంలో మరో ట్విస్టు

టెక్కలి: వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారంలో మరో ట్విస్టు చోటుచేసుకుంది. ఆయన నివాసం ఉంటున్న ఇంటి స్థలం తనదంటూ ఓ రిటైర్డ్ టీచర్ చింతాడ పార్వతీశం మీడియాకు వెల్లడించారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. 'నా దగ్గరే దువ్వాడ శ్రీనివాస్ ఇంటి స్థలం కొనుగోలు చేశారు. ఇంకా నాకు రూ.60లక్షల బకాయి రావాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన మూడు చెక్కులు సైతం నా వద్ద ఉన్నాయి. ఈ స్థలం రిజిస్ట్రేషన్‌కు ముందు మా కుటుంబం పేరునే డాక్యుమెంట్లు ఉన్నాయి. వాటిని కావాలంటే చూపిస్తా. ఇంటి స్థలం నాదైతే దువ్వాడ కుటుంబం పోటీపడటం ఏమిటి.' అని పార్వతీశం అన్నారు. కాగా, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నివాసం వద్ద జరుగుతున్న హైడ్రామా బుధవారం నాటికి ఆరో రోజుకి చేరుకుంది. ఇంటి బయటే దువ్వాడ వాణి న్యాయపోరాట దీక్ష కొనసాగిస్తుండగా, శ్రీనివాస్ మాత్రం ఇంటి లోపలే ఉన్నారు. విశాఖలో చికిత్స పొందుతున్న దివ్వల మాధురి సైతం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఎప్పటిలాగే పోలీసుల బందోబస్తు కొనసాగుతుంది. మంగళవారం రాత్రి దువ్వాడ సోదరుడు బాబా, వాణి బంధువుల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఇప్పుడు శ్రీనివాస్ ఉంటున్న ఇల్లు తప్ప అన్ని డిమాండ్లకు తాము అంగీకరిస్తున్నామని బాబా చెప్పగా, డిమాండ్ల పరిష్కారానికి ఆయన ఎవరంటూ వాణి ఎదురు ప్రశ్నించారు.

ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో వార్షిక పరీక్షలు తప్పిన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు పెంచినట్టు పరీక్షల డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. ఈ నెల 21వ తేదీలోగా విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించుకోవచ్చన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి: ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)లో పారామెడికల్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఎంఎల్‌టీ, డీఎంఐటీ, డీఆర్‌టీటీ/ డీఆర్ ఈఎస్‌టీ, డీఎంఎస్‌టీ, డీవోఎం, డీఈసీజీ, డీఏఎన్ఎస్, డీఎంపీహెచ్ఏ, డికార్డియో కోర్సులకు దరఖాస్తులు ఈ నెల 18వ తేదీ నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకు స్వీకరించనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

అంబేడ్కర్ యూనివర్సిటీలో..

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఆరు నెలల కాల వ్యవధి గల యోగా డిప్లమో కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రిజిస్ట్రార్ పి.సుజాత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా ఎలాంటి రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. రూ.500 అపరాధ రుసుంతో వచ్చే నెల 9వ తేదీ వరకు గుడువు ఉందన్నారు. వర్సిటీ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రార్ పేరిట రూ.200 ఆన్‌లైన్‌లో చెల్లించిన ఫీజు రసీదు, ధ్రువ పత్రాల జెరాక్స్‌లతో వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

17న జాబ్ మేళా

కలెక్టరేట్: స్థానిక నెహ్రూ యువ కేంద్రంలో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమెజాన్‌లో 200 ఉద్యోగాలకు పదో తరగతి నుంచి డిగ్రీ చదువుకున్నవార అర్హులన్నారు. ఆసక్తి గలవారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని ఆరోజు ఉదయం 10 గంటలకు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసుకుని హాజరు కావాలన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థుల నాలుగో సెమిస్టర్ ఫలితాలను బుధవారం విడుదల చేసినట్టు డీన్ ఎస్.ఉదయ భాస్కర్ తెలిపారు. బీఏ, బీబీఏ, బీసీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో మొత్తం 6,823మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, ఇందులో 3,129 మంది ఉత్తీర్ణులై 45.86 శాతం ఫలితాలు వచ్చినట్టు చెప్పారు. ఫలితాలపై ఎలాంటి సందేహాలు ఉన్నా 15 రోజుల్లోగా నిర్దేశించిన ఫీజు చెల్లించి పునఃమూల్యాంకానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్

కలెక్టరేట్: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సూచనల మేరకు ప్రతీ నెల మూడో శుక్రవారం దివ్యాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ (స్వాభిమాన్)ను నిర్వహించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో గల గ్రీవెన్స్ హాల్‌లో వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు

ఇచ్ఛాపురం: స్వాతంత్ర్య దినోత్సం సందర్భంగా ఎటువంటి జంతు బలులు చేపట్టకూడదని, మాంసం దుకాణాలు, హోటల్ యజమానులుకు మాంసం అమ్మటం నిషేధించినట్టు కమిషనర్ ఎన్.రమేష్ ప్రకటనలో ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజారోగ్య నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మేరా భారత్ మహాన్

హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు బుధవారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, సంస్థలు, పార్టీ ఆధ్వర్యంలో ఉత్సాహంగా చేపట్టారు. విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సంస్థల ప్రతినిధులు మువ్వన్నెల జెండాను పట్టుకుని మేరా భారత్ మహాన్, వందేమాతరం అంటూ నినదించి స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించారు.

-ఆంధ్రజ్యోతి బృందం

- ఉత్సాహంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు
- జాతీయ జెండాలతో స్వాతంత్ర్య సందడి



నరసన్నపేట ప్రభుత్వ కళాశాల మైదానంలో..


ఎచ్చెర్ల: ట్రిపుల్ ఐటీలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ


సంతబొమ్మాళి: చినతుంగాం లో 50 అడుగుల జెండాతో..



టెక్కలి: హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌వీఆర్‌కే కళాశాల విద్యార్థులు



ఇచ్ఛాపురం, రణస్థలం: కొండములగాంలో ర్యాలీల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు అశోక్, ఎన్ఈఆర్


కాశీబుగ్గ: పాతబస్టాప్ వద్ద విద్యార్థుల మానవహారం


ఆమదాలవలస: మండల సమాఖ్య ఆవరణలో జాతీయ జెండాతో..

భారీ వర్షం.. రైతుల్లో హర్షం

ఎల్.ఎన్.పేట/నరసన్నపేట: జిల్లాలో పలు ప్రాంతాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. ఎల్ఎన్‌పేట, నరసన్నపేటల్లో భారీ వర్షం కురవడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. కొన్నాళ్లుగా వర్షం లేకపోవడంతో ఎద పొలాలు ఎండిపోతున్న సమయంలో వర్షం కురవడంతో ఊపిరిపోసినట్లయింది.

పీజీ విద్యార్థిని మృతిపై విచారణ: మంత్రి

కోటబొమ్మాళి: నిమ్మాడ కాలనీకి చెందిన పీజీ విద్యార్థిని కొంచాడ నీలమ్మ (22) డెంగ్యూతో మృతి చెందడం బాధాకరమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నీలమ్మ వైద్య సేవల కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి వెళ్లగా వైద్యులు లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ ఘటనపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆయన స్పందిస్తూ.. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్‌ను ఆదేశించారు.

శ్రీనివాస్‌తో ఫ్రెండ్‌షిప్ కొనసాగిస్తా

- ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాధురి

టెక్కలి: 'ఎమ్మెల్సీ శ్రీనివాస్‌తో ఫ్రెండ్‌షిప్ ఇలాగే కొనసాగిస్తా.. ఆయన ఒంటరి అయిపోయాడు.. నాకు మంచి బెస్ట్ ఫ్రెండ్, క్లోజ్ ఫ్రెండ్' అని మాధురి అన్నారు. బుధవారం ఆమె 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆమె మాటల్లోనే.. 'అతనికి ఏ బాధ అనిపించినా నాతో షేర్ చేసుకోవడం, నేను ఏది అనిపించినా ఆయనతో షేర్ చేసుకోవడం, అతనికి ఫైనాన్స్ అవసరమైతే ఆదుకుంటా.. ఆయన అంటే ఇష్టం, అభిమానం, గౌరవం. అతని గూర్చి మొత్తం తెలుసుకున్నాను కాబట్టే ఇష్టపడ్డాను. తల్లీ కూతుర్లు రాజకీయ, డబ్బు పిచ్చితో ఆయనను చంపేందుకు వెళ్లగా సెల్ఫ్ ప్రొటెక్షన్‌తో శ్రీనివాస్ అడ్డుకున్నారు' అన్నారు.

కోటబొమ్మాళి ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేస్తాం: మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలో ప్రస్తుతం ఉన్న 30 పడకల ఆసుపత్రిని మోడల్ ఆసుపత్రిగా తీర్చిదిద్దడంతో పాటు 50 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని అకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రం చేయాలని, గోడలపై పోస్టర్లు అంటించకుండా తగు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య నిపుణులు, సిబ్బంది పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ సూర్తి కల్యాణబాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ పొన్నాడ గణేష్ తదితరులు పాల్గొన్నారు.


బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

బస్సు సర్వీసులను పునరుద్ధరించండి

గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ సేవలను కల్పించాలని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం కోటబొమ్మాళిలో శ్రీకాకుళం ఆర్టీసీ 1, 2 డిపోలకు చెందిన శ్రీకాకుళం- విశాఖపట్నం రెండు, శ్రీకాకుళం- విజయవాడ రెండు బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటబొమ్మాళి ఊర్లో నుంచి విశాఖకు గతంలో ఒక ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ఉండేదని, దానిని పునరుద్ధరించాలని ఆదేశించారు. అలాగే మరికొన్ని గ్రామాలకు సర్వీసులను నడపాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్లు కేఆర్ఎస్‌శర్మ, పీవీఎస్‌కేరాజు, ఆర్.శ్రీనివాసరావు, పలువురు టీడీపీ నేతలు టీడీపీ నేతలు బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్, తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎంజీఆర్

కొత్తూరు: ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్ష తన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తూరు మండల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధంచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు లోతుగెడ్డ తులసీవర ప్రసాద్, సుమతి, ఎంపీడీవో పావని తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

నాణ్యమైన భోజనం అందించాలి: శిరీష

కాశీబుగ్గ: పేదలకు మూడు పూటలా నాణ్యమైన భోజనం పెట్టి వారి ఆకలిని తీర్చేందుకు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామని, పలాసలో శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం అన్న క్యాంటీన్‌ను అధికారులు, టీడీపీ నేతలతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ టి నాగేంద్రకుమార్, టీడీపీ నేతలు వజ్జ బాబూరావు, పి.విఠల్‌రావు, గాలి కృష్ణారావు, సూర్యనారాయణ, డొక్కరి శంకర్, రవి శంకర్ గుప్తా, డీఈ కనకరాజు, ఏఈ అవినాష్ తదితరులు పాల్గొన్నారు. ● కాశీబుగ్గ గాంధీనగర్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అధికారులకు ఆదేశించారు. కోర్టు తీర్పుతో మునిసిపాలిటీ స్వాధీనం చేసుకున్న స్థలాన్ని బుధవారం పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలన్నారు.


ఆక్రమణలు తొలగించిన స్థలాన్ని పరిశీలిస్తున్న గౌతు శిరీష

మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందించాలి

జలుమూరు (సారవకోట)/పాతపట్నం: ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం అందించాలని పాతపట్నం జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోషిణి అన్నారు. సారవకోట, పాతపట్నంలోని కేజీబీవీలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటలు, మరుగుదొడ్లు, బాత్‌రూంలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వంటగది పరిసరాలు, వంటపాత్రలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆమెతో పాటు ప్రత్యేకాధికారులు అరుణనాయుడు, సంతోషి పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.